
# నిర్ణయం

పి.ఎస్.ఎన్.రెడ్డి



ఆమె ఇల్లు అదో కాదో! అని సందేహిస్తూ కాలింగ్ బెల్ నొక్కాను. ఎవరో అపరిచిత వ్యక్తి తలుపు తీశాడు. అతను నన్ను ఆపాదమస్తకం పరిశీలించి "ఎవరు కావాలి?" అనడిగాడు.

"జ్యోత్స్న" అన్నాను.

**క్షణం ఏదో ఆలోచించినవాడై "మీరెవరు?" మరల ప్రశ్నించాడు. "పేరు శరత్ చంద్ర, జ్యోత్స్న క్లాస్‌మేట్‌ని" అనగానే లోపలికి రమ్మని సాదరంగా ఆహ్వానించి కూర్చోమంటూ సోఫా చూపించాడతను.**

అతనితో సంభాషణ ప్రారంభించే నిమిత్తం "మీరు జ్యోత్స్న బ్రదరా?" అని అడిగాను. ఆమెకు అన్నదమ్ములెవరూ లేరని తెలిసినా.

"జ్యోత్స్న కజిన్ని" నవ్వుతూ బదులిచ్చి "జ్యోత్స్నను పిలుస్తావుండండి" అంటూ లోనికి వెళ్ళాడు.

జ్యోత్స్నను చూడాలనే కోరిక క్షణ క్షణం పెరిగి పదే పదే అతను వెళ్ళిన వైపు దృష్టి సారించసాగాను. జ్యోత్స్న అంటే నాకెందుకో తెలియని విపరీతమైన అభిమానం. మృదువైన మనస్తత్వం, నాజూకైన భావ సరళి, నిష్కల్మషత్వం. ఆమె ఉన్నతమైన వ్యక్తిత్వమే బహుశా అందుకు కారణం కావచ్చు.

"చందూ!" అంది ఆనందం, ఆశ్చర్యం సంగమించిన స్వరంతో.

"జ్యోత్స్న! నువ్వు..." నా మాటలు సగంలోనే ఆగిపోయాయి, మాట్లాడటానికి నోరు పెగల్లేదు. గొంతు పూడుకు పోయినట్లయింది. ఒక్కప్పటి కాలేజ్ బ్యూటీ జ్యోత్స్నేనా ఈమె! కాలిన మచ్చలతో వికృతంగా ఉన్న ఆమెను చూసి క్షణం స్తబ్ధుణ్ణయ్యాను.

"జ్యోత్స్న! ఏం జరిగింది?" ఆషాక్ నుండి తెరుకోవడానికి ప్రయత్నిస్తూ గద్గద స్వరంతో అడిగాను.

"ఏముందీ! అంతా పాత కథే! వరకట్నపు వికటాట్టహాసం" అంటూ తేలికగా నవ్వేసింది.

నా గుండెలు పిండేసినట్లు, అగ్ని పర్వతాలు బ్రద్దలై, లావా ఉప్పొంగి నన్ను నిలువునా ముంచేసినట్టు విల విల లాడుతూ, చెమ్మగిల్లిన నా కళ్ళను ఆమెక్కడ చూస్తుందో నని ప్రక్కకు తిప్పుకున్నాను. అయినా నా పరిస్థితి గమనించి, నా కనుకొలకుల నుంచి జారడానికి తహతహలాడుతున్న అశృవులను తన చేతి వేలి కొనలతో తుడిచింది. చాలాసేపు ఇద్దరి నడుమ మాటలు కరువయ్యాయి.

"నా కథకేం గాని! నువ్వేంటి అకస్మాత్తుగా ఊడి పడ్డావు? ఇప్పుడెక్కడ వుంటున్నావు? పెళ్లైందా? లేదా?" అంటూ తన సహజ ధోరణిలో ప్రశ్నల వర్షం కురిపించింది.

ఆమె నవ్వుతూ మాట్లాడుతున్నా ఆ నవ్వులో నాటి సహజత్వం, మాటల్లో మార్దవం, లేవు. వాటి స్థానంలో నిరాశ, నిర్లిప్తత నిండి ఉన్నాయి.



"ప్రొడ్యూసర్ గారు! మీ పిక్చర్‌లో ఒక మూగవాడిని హీరోగా తీసుకున్నారు. మరి డైలాగ్స్ ఎలా చెబుతాడండి?" అడిగాడు విలేఖరి ఆశ్చర్యంగా.
"మాటలు వచ్చిన వారికైనా ఎలాగూ డబ్బింగ్ చెప్పించుతున్నాం కదండీ అందుకని మూగవాడినే పెట్టాం. డబ్బింగ్ చెప్పించుతాం.. అని అసలు సంగతి చెప్పాడు ప్రొడ్యూసర్.
పి.ఎం. సుందరరావు — విజయవాడ

"వైజాగ్‌లో వుంటున్నాను. ఆఫీసు పని మీద వచ్చాను. వచ్చి వారం రోజులైంది. మరో వారం రోజులుంటాను" చెప్పాను.

"ఇప్పుడు గుర్తుకొచ్చానా నేను?" అంది దెప్పి పొడుపుగా

"ఈ శిలను అందమైన శిల్పంగా మలచి జీవం పోసిన శిల్పివి నువ్వు. ఎలా మర్చిపోగలను" అన్నాను.

"ఇంతకీ నీ పెళ్ళి విషయం చెప్పలేదు" అడిగింది.

"అ అభిరుచికి తగిన అమ్మాయి తారసపడితే తప్పకుండా చేసుకుంటా? జ్యోత్స్న! నేను వెళాలి మరలా వచ్చి కలుస్తాను" అంటూ కంగారుగా లేచాను.

"అదేవిటి? అప్పుడే వెళతానంటావు? రాక రాక వచ్చావు భోజనం చేసి వెళుదువు" అంది.

"సారీ జ్యోత్స్న! నాకు వేరే ఎంగేజ్‌మెంట్ వుంది. వెళ్ళాలి. ఏమి అనుకోకు. సీ.యు." చెప్పి బయట పడ్డాను.

☆ ☆ ☆

మనసంతా వికలమై ఎంత ప్రయత్నించినా నిద్ర దరిచేర లేదు. ఒక్కప్పుడు జ్యోత్స్నెవరో? నేనెవరో? నా అన్ కాన్షియస్ మైండ్‌లో నిక్షిప్తమైయున్న ఆమె జ్ఞాపకాలు కళ్ళముందు లీలలా కనిపించసాగాయి.

జ్యోత్స్నతో నా పరిచయం చాలా విచిత్రంగా జరిగింది. నేను హైస్కూలు చదివే రోజుల్లో కాలేజి జీవితం గురించి ఏవేవో ఊహించుకుంటూ కలలు గనేవాణ్ణి.

కాలేజికి వెళ్ళడం మనిషి జీవితంలో ఒక వరమని, అమ్మాయిల వెంటపడటం. టీజ్ చేయడం, తరచు క్లాసులకు నామం బెట్టి సినిమాలకూ, షికార్లకూ వెళ్ళడం హీరోయిజమని చెప్పుకొనే మా సీనియర్స్ మాటలకు పూర్తిగా ప్రభావితుణ్ణయాను.

మా నాన్నగారికి పోలిటెక్నిక్ చదివించాలని వుండేది. నా మార్కులకు సీటు రాదని తెలిసి ఇంటరులో చేర్పడంతో నా కలలు పండించుకొనే రోజులొచ్చాయి.

అమ్మాయిల్ని కామెంట్ చేయడం, సుద్ద ముక్కలు, పేపర్ రాకెట్లు విసరడం, ఒకటేమిటి? నా ఆగడాలకు అంతుండేది కాదు. నా అభిప్రాయాలతోను, అభిరుచులతోను ఏకీభవించే నాలాంటి వాళ్ళు చాలా మంది నాతో చేతులు కలిపేసరికి మాదొక బ్యాచ్‌గా తయారైంది. మేమెంత అల్లరి పెట్టినా ప్రిన్సిపాల్‌కి రిపోర్టు చేయడానికి ఎవరూ సాహసించేవారు కాదు. లెక్చరర్స్ కూడా వీళ్ళతో మనకెందుకులే గొడవలని చూసీ, చూడనట్టు పోయేవారు - అలాంటి సమయంలో అనుకోకుండా నా దృష్టి జ్యోత్స్న మీద పడింది.

మా క్లాసు అమ్మాయి లందరిలోను జ్యోత్స్నకు ఒక ప్రత్యేకతుంది. అందమైనది. తెలివైనది. పదవ తరగతి జిల్లాలో మొదటి ర్యాంకు తెచ్చుకుంది.

సన్నగా సన్నజాజి తీగలా నాజూగ్గా వుండే ఆమెను కన్నార్పకుండా చూడని మగాడు వుండడు.

ఒత్తయిన జుట్టు, కలువ రేకుల్లా లేకపోయినా ఆకర్షణీయమైన కళ్ళు, సింధూరం లాంటి పెదవుల మధ్య మెరుపులాంటి తెల్లని పలువరుస, నవ్వితే సొట్టలు పడే నును చెక్కిళ్ళు, లేక రోజా రంగు శరీరచ్ఛాయ - చూడడానికి సహజంగా, ఆడతనానికి చిహ్నంగా, చాలా సింపుల్‌గా వుండే ఆమెను ఎందుకో అందరిలా ట్రీట్ చేయాలనిపించలేదు.

బస్ కాంప్లెక్స్ బుక్ స్టాల్లో "ప్రేమ లేఖలు వ్రాయడం ఎలా?" అనే పుస్తకం కొని చదివి ఆ రాత్రంతా కష్టపడి ఎలాగైతేనేమి ఒక ప్రేమలేఖ సృష్టించి మర్నాడు లీజర్ టైమ్‌లో ఎవరూ చూడకుండా జ్యోత్స్న పుస్తకాల్లో పెట్టాను.

సాయంత్రం కాలేజ్ అయిన తరువాత గార్డెన్ దగ్గర జ్యోత్స్న ఒకర్తే నా కోసం ఎదురుచూస్తూ నిల్చుండటంతో ఉబ్బి తబ్బిబ్బవుతూ హుషారుగా అటువైపు నడిచాను.

"యూ స్టుపిడ్! హౌ డేర్‌యు? ఫస్టియర్ మూడు సబ్జక్టులుంచుకొని ఇలా వెధవ వేషాలేయడానికి సిగ్గులేదూ? అయినా నువ్వెక్కడ? నేనెక్కడ? నీకే అర్హతుందని ప్రేమించాలి? తలచుకుంటే ఈ లెటర్ సహాయంతో నిన్నీక్షణంలోనే సస్పెండ్ చేయించగలను. మైండ్ ఇట్" అంటూ తుఫానులా నా మీద విరుచుకుపడి నేనా విస్మయం నుండి తేరుకొనే లోపు, రొప్పుతూ విసురుగా నా ముందు నుంచి వెళ్ళిపోయింది.

ఆ అవమానం భరించలేక వారం రోజుల వరకూ కాలేజికి వెళ్ళలేదు. ఆమె మీద ప్రతీకారం

తీర్చుకోమని నాలోని దానవత్వం నన్ను పదే పదే ప్రేరేపించినా, ఏ మూలనో కొంతంత మానవత్వం మిగులుండటం చేత ఆమెకు ఎలాంటి హాని చేయలేకపోయాను. ఏ చదువులో తను గొప్పదాన్నని మిడిసిపడుతుందో. ఆ చదువులోనే ఆమెతో పోటీ పడాలని నిర్ణయించుకున్నాను. నాటినుండీ నా ప్రవర్తనలో మార్పు రావడం పలువుర్ని ఆశ్చర్యపరచినా, విషయం మాత్రం జ్యోత్స్నకు,నాకు తప్ప మరెవ్వరికీ తెలియదు.

ఇంజనీరింగ్ ఎంట్రన్స్ వ్రాస్తానంటే నాన్నగారు అవహాస్యం చేశారు. దానితో ఆ ఆలోచన వదులుకున్నాను. మా రిజల్ట్స్ వచ్చాయి. నాకు ఫస్టుక్లాసు వచ్చిందని ఇంట్లో వాళ్ళందరూ సంతోషించినప్పటికి నాకెందుకో అసంతృప్తిగానే అనిపించింది.

ఆ రోజు ఫస్ట్ డిగ్రీ ఎడ్మిషన్స్ జరుగుతున్నాయి. "కంగ్రాచ్యులేషన్" అనే గొంతు వినిపించి ఎవరా అని తలెత్తి చూశాను. ఎదురుగా చిరునవ్వు చిందిస్తూ జ్యోత్స్న. ఎందుకో ఆమె మీద నాకెలాంటి కోపం రాలేదు.

"థాంక్స్" బదులుగా నవ్వాను.

"ఇంజనీరింగ్ ఎంట్రన్స్ వ్రాశారా?" అడిగింది.

"లేదు మీరు?" అన్నాను ప్రశ్నార్థకంగా చూస్తూ.

"వ్రాయలేదు. మా వాళ్ళకి చాదస్తం ఎక్కువ. నేను దూరంగా వెళ్ళి చదువుకోడానికి ఒప్పుకోరు. నేను డిగ్రీ చదవడం కూడా వాళ్ళ కిష్టం లేదు" అంటూ నిరాశగా నవ్వింది.

ఆ రోజు నుంచీ మా పరిచయం పుష్పించి, స్నేహ పరిమళాలు విరజిమ్మింది. గతాన్ని తలచుకుంటే నా ప్రవర్తనకి నా మీద నాకే అసహ్యం వేసేది. మరునటి సంవత్సరం నాకు ఇంజనీరింగ్ సీటు రావడంతో డిగ్రీ డిస్‌కంటిన్యూ చేశాను.

సంవత్సరంగా పెంచుకున్న స్నేహబంధం, పంచుకున్న ఆత్మీయత దూరమౌతుంటే మనసు భారమైంది. జ్యోత్స్న మరీ సెన్సిటివ్. నాకు వీడ్కోలిస్తూ పసిపాపలా ఏడ్చేసింది. అదే సంవత్సరం ఒక పొలిటీషియన్‌తో జ్యోత్స్న పెళ్ళి జరిగింది. ఒక బ్రిలియంట్ స్టూడెంట్ చదువు మధ్యలో ఆగిపోవడం బాధ కల్గించినా, ఆమె ఒక ఇంటిదైనందుకు సంతోషించాను. ఆ తరువాత మా నాన్నగారికి ట్రాన్స్‌ఫర్ అవ్వడం, నాకు బి.టెక్. పూర్తయిన వెంటనే జాబ్ రావడంతో ఆమెను కలిసే అవకాశం లేకపోయింది. మరల ఇదిగో... ఇప్పుడు...ఇలా! ఆలోచనలతో ఎప్పటికో గాని నిద్రపట్టలేదు.



"పోయిన సారి మీరు తీసిన 'నాగదేవత' సినిమాకి భక్తులకుపూనకాలు వస్తున్నాయని పబ్లిసిటీ ఇచ్చి గొప్ప హిట్ చేయించారు కదా. ఈసారి తీసిన 'నాగమహిమ' ఫ్లావయ్యిందేం?"

"ఏముందీ ఈసారి మా సినిమా 'నాగమహిమ'కు థియేటర్‌లోకి పాములొస్తున్నాయని పబ్లిసిటీ చేయించాడు మా డిస్ట్రిబ్యూటరు" వాపోతూ చెప్పాడు నిర్మాత.

-కోగంటి మురళీకృష్ణ ఒంగోలు

*** *** ***

"ఏవిటీ? ఏదో ముఖ్యమైన విషయం మాట్లాడాలన్నావు?" నావైపు ఆసక్తిగా చూస్తూ అడిగింది.

"ఏం లేదు జ్యోత్స్నా! నేను వచ్చినపని పూర్తయింది. వెళ్ళేముందు నిన్నో విషయం అడగాలి" అన్నాను.

"ఏవిటది !?" అంది.

"ఎన్నాళ్ళని ఒంటరి జీవితాన్ని గడుపుతావు?" అర్థంకానట్లు చూసింది.

"నాతో జీవితం పంచుకోగలవా?" మనసులో మాట సూటిగా చెప్పేసరికి క్షణం హతాశురాలైంది. ఆమె ఊహించని ప్రశ్న అది.

"చందూ! మతుండే మాట్లాడుతున్నావా !?" విస్మయంగా అడిగింది.

"ఏం? నాది కోరరాని కోరికా?"

"అది కాదు చందూ !..." అంటూ ఏదో చెప్పబోతుంటే మధ్యలో కట్ చేస్తూ...

"నీ మీద జాలితోను, సానుభూతితోను నేనీ నిర్ణయం తీసుకోలేదు. నాకో తోడు కావాలి. అదీ నన్నర్థం చేసుకొని నాతో సహకరించే వ్యక్తి కావాలి. ఆ అర్హతలన్నీ నీకున్నాయి" నిస్సంకోచంగా నా మనసులో మాట చెప్పేశాను.

"చందూ! నేనొక పాపకు తల్లినన్న విషయం మర్చిపోయావా? అయినా ఇంకా నా దగ్గరేం మిగులుందని" ఏదో చెప్పాలని ప్రయత్నిస్తున్న ఆమెకు అడ్డుతగులుతూ అన్నాను.

"లేదు." అన్నీ తెలిసే ఈ నిర్ణయం తీసుకున్నా. స్నేహితురాలిగా నువ్వందించే ప్రేమ, ఆప్యాయత నాకు జీవితాంతం కావాలి. బాగా ఆలోచించే నీ నిర్ణయం తెలియజేయి. కాని ఒక్క విషయం. నీకోసం జీవితకాలమైనా నిరీక్షించగలనేమో గాని, నిన్ను తప్ప మరొకరిని నా జీవితంలోకి ఆహ్వానించలేను.

మరొక విషయం. నా ఫ్రెండ్ ప్లాస్టిక్ సర్జన్ ఒకతను బర్న్స్‌లో స్పెషలైజేషన్ చేశాడు. వాడికి నీ గురించి చెప్పాను. నీ శరీరం పెద్దగా కాలిపోలేదు కనుక నీ ముఖం మామూలుగా అయ్యే అవకాశముంది. నీలో మరల మునుపటి జ్యోత్స్నను చూడాలని ఆశపడుతున్నాను. స్నేహితుడిగా అర్థిస్తున్నా! నా ఈ కోరికను మాత్రం కాదనకు."

కొంతసేపు మౌనం తర్వాత "నీ ఇష్టం" అందామె.

"థాంక్స్ జ్యోత్స్నా!" ఆ ఆనందంలో అప్రయత్నంగా ఆమె రెండు చేతులూ పట్టుకున్నాను.

## రచయితలకు సూచనలు

★ ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధానికి వ్యాసాలు, కథలు, కార్టూన్లు, కవితలు, ఫోటోలు, జోకులు ఆహ్వానిస్తున్నాం.

★ మీరు పంపే ప్రతి రచనా స్వంతమేనన్న హామీ పత్రం రచనతో విధిగా జతపరచాలి. అనువాదాలూ, అనుసరణలూ అయితే రచనమూలం, రచయిత పేరు, ప్రచురితమైన ప్రతిక వగైరా వివరాలు తెలియపరచడం తప్పనిసరి.

★ జోకులు మినహా ప్రచురించే ప్రతి అంశానికీ తగిన పారితోషికం ఉంటుంది.

★ ప్రచురణార్హం కాని రచనలు తిప్పిపంపాలంటే తగినన్ని స్టాంపులు అంటించిన కవరు రచనలతో జత చేయాలి.

★ రచనలు ప్రచురించే విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలకు తావు లేదు.

★ వ్యాసాలు నాలుగు లేదా ఐదు అర ఠావులకు మించకుండా ఉంటే మంచిది. కాగితానికి ఒకవైపే రాయాలన్న విషయం గమనార్హం!